వామపక్ష యోధుడు సీతారాం ఏచూరి

కడప ఎడ్యుకేషన్: మాజీ రాజ్యసభ సభ్యులు, కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పేదల, పీడితుల ఉద్యమాలకు వేగుచుక్క అని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మి రాజా, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్‌బాబు పేర్కొన్నారు. సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మృతిపట్ల సంతాపం తెలుపుతూ గురువారం కడపలోని యూటీఎఫ్ భవన్‌లో యూటీఎఫ్ జిల్లా శాఖ తరపున ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతారాం ఏచూరి మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని అన్నారు. సీతారాం జీవితాంతం పేదల, పీడితుల పక్షాన ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు సాగించారన్నారు. రాజ్యసభ సభ్యుడిగా ప్రజల పక్షాన, ప్రజా ఉద్యమాల పక్షాన ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. విద్యార్థి దశ నుండే వామపక్ష భావాలతో కమ్యూనిస్టు పార్టీ జాతీయ నాయకుడిగా ఎదిగారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ట్రెజరర్ నరసింహారావు, కార్యదర్శులు సి.వి.రమణ, ఎజాస్ అహ్మద్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, సీనియర్ నాయకులు చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు గాజులపల్లె గోపినాథ్, బత్తుల చంద్రశేఖర్, కిరణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మరణం తీరని లోటు

కడప వైఎస్ఆర్ సర్కిల్: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్ట్ ఉద్యమానికి తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కడప నగర కార్యదర్శి ఏ.రామ్మోహన్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కే.శ్రీనివాసులు రెడ్డి, బి.దస్తగిరి రెడ్డి, కడప నగర కమిటీ సభ్యులు చంద్ర రెడ్డి, సీఐటీయూ నాయకులు స్టీఫెన్, నారాయణ రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాహుల్, రవి, రామకృష్ణారెడ్డి, మాధవరెడ్డి, కుమార స్వామి, రఘు తదితరులు పాల్గొన్నారు.


సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

సీపీఐ కార్యాలయంలో...

సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ఒక ప్రకటనలో సంతాపాన్ని తెలియజేశారు. నమ్మిన సిద్ధాంతాల కోసం అవిశ్రాంతంగా పోరాడిన ఏచూరి మరణం తీరని లోటు అన్నారు.

ఆర్‌సీపీ కార్యాలయంలో...

దేశ ప్రజలందరికీ సమాన హక్కులు, సమాన విలువలు కలిగి సమానత్వంతో ఉండాలని నిరంతరం పోరాటాలు నిర్వహించిన కమ్యూనిస్టు దిగ్గజం సీతారాం ఏచూరి మరణం దేశానికి తీరని లోటని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి అన్నారు. గురువారం ఆర్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీతారాం ఏచూరి సేవలను గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో దళిత గిరిజన హక్కుల పోరాట సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు వెంకటేశు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ప్రతాపరెడ్డి, రాయలసీమ మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి తస్లీమా, తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి మరణం తీరని లోటు

కడప కల్చరల్ : రాజకీయాల్లో అరుదైన పాత్ర పోషించిన సీతారాం ఏచూరి మృతి ప్రత్యామ్నాయ శక్తులకు తీరని లోటని బీమా ఉద్యోగుల సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎ.రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఆయన తన ప్రకటనలో దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా మన్ననలు పొందిన సీతారాం ఏచూరి సెక్యులర్, సంకీర్ణ రాజకీయాలకు అనితర సాధ్యమైన తోడ్పాటును అందించారన్నారు. కార్మికోద్యమాలకు ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు ఆయన అహరహం శ్రమించారని, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా గొప్ప పేరు సాధించిన సీతారాం ఏచూరి మృతికి శ్రద్ధాంజలి ఘటిస్తున్నామన్నారు.


సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు


మాట్లాడుతున్న ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎన్. రవిశంకర్ రెడ్డి

రానున్న రోజుల్లో డేటాసైన్స్‌కు ప్రాధాన్యత

వైవీయూ: ప్రస్తుత పరిస్థితుల్లో, రానున్న రోజుల్లో డేటా సైన్స్, మిషన్ లెర్నింగ్‌లు అత్యంత ప్రాధాన్యత అంశాలు కానున్నాయని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్, కోల్‌కతా పూర్వ సంచాలకులు డాక్టర్ బి.ఎల్.ఎస్. ప్రకాషరావు పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్, ఇండియన్ సొసైటీ ఫర్ ప్రాబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో 'డేటా సైన్స్ అండ్ మిషన్ లెర్నింగ్' అన్న అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా విచ్చేసిన డా. ప్రకాషరావు మాట్లాడుతూ సాంకేతికత విస్తరించే కొద్దీ జనాభా పెరుగుదలకు అనుగుణంగా స్టాటిస్టిక్స్, ఇతర మాధ్యమాల అవసరం కూడా విపరీతంగా పెరుగుతుందన్నారు. ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్, ఇండియన్ సొసైటీ ఫర్ ప్రాబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్ గౌరవాధ్యక్షులు ఆచార్య పి. రాజశేఖరరెడ్డి, విశ్రాంత ఐఏఎస్ అధికారి, కళాశాల పూర్వ విద్యార్థి కె. ప్రభాకర్‌రెడ్డి , ఎస్ఎస్ఎస్‌ఓ డైరెక్టర్ ఎ.ఎస్.ఎన్. మల్లేశ్వరరావు , కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ మాట్లాడారు. అనంతరం అతిథులను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా, అధ్యాపకులు పాల్గొన్నారు.


అతిథులను జ్ఞాపిక అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు

శేషయ్యవారిపల్లెలో తాగునీటికి ఇక్కట్లు

కడప కార్పొరేషన్: కడప నగరం 49వ డివిజన్‌లోని శేషయ్యవారిపల్లెలో తాగునీరు లేక జనం అల్లాడుతున్నారు. ఇక్కడ పైపులైన్ పనులు చేస్తున్న ఏపీఐఐసీ కాంట్రాక్టర్ జేసీబీతో గుంతలు తీసేటప్పుడు తాగునీటి కొళాయి కనెక్షన్లను ఇష్టం వచ్చినట్లు పీకేశారు. దీనివల్ల ఎక్కడికక్కడ కొళాయి కనెక్షన్లకు ఇచ్చిన పైపులు తెగిపోయి తాగునీరు సరఫరా కావడం లేదు. కొన్ని చోట్ల పైపులు పగిలిపోయి నీరు వృథాగా ప్రవహిస్తోంది. వారం రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ నివసించే వారు ఎక్కువ శాతం రోజువారీ కూలీలే కావడంతో ప్రొద్దున పోయి సాయంత్రానికి ఇంటికి వచ్చే సరికి చుక్క కూడా నీరు లేక దుస్తులు ఉతకడానికి, స్నానం చేయడానికి అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే కొళాయి పైపులైన్ కనెక్షన్లు సరిచేసి నీటిని సరఫరా చేయాలని వారు కోరుతున్నారు.


శేషయ్యవారిపల్లెలో జేసీబీతో గుంతలు తీయడంతో విరిగిపోయిన కొళాయి పైపులు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

వైవీయూ: మాదక ద్రవ్యాలు, మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలని డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ వైస్ చాన్సలర్ ఆచార్య జి. విశ్వనాథ కుమార్ సూచించారు. గురువారం కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో జేబీవీఎస్ ది ప్రిజర్వర్ సేవా సమితి ఆధ్వర్యంలో నషా ముక్తి భారత్ పక్షోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగంతో యువత తప్పుదోవపడతారన్నారు. సైక్రియాటిస్టు షాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ చెడు స్నేహాలు మాదక ద్రవ్యాల అలవాటుకు దారితీస్తున్నాయన్నారు. జేబీవీఎస్ ది ప్రిజర్వర్ సేవాసమితి వ్యవస్థాపకుడు అశోక్, డాక్టర్ నూరి పారి మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖాధికారిని సస్పెండ్ చేయాలి

కడప వైఎస్సార్ సర్కిల్ : ఆశా కార్మికుల పట్ల అవమానకరంగా వ్యవహరించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజును సస్పెండ్ చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు గుంటి వేణుగోపాల్ కోరారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏపీ ఆశా వర్కర్ యూనియన్ నగర సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న అధికారులు ఆశాలను అదనపు పని చేయాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. జమ్మలమడుగు మండలం మొరగుడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న నలుగురు ఆశాలను అదనపు పని చేయాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. వేంపల్లి మండలం తాళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ బసవయ్య ఆశా కార్యకర్తలను చెప్పుకోలేని పదజాలంతో మాట్లాడి మనోవేదనకు గురి చేస్తున్నాడన్నారు. ఈ విషయాలను వైద్య ఆరోగ్యశాఖ అధికారికి విన్నవించుకుందామంటే ఆయన నిర్లక్ష్యం వహిస్తూ మీరు ఇక్కడికి రాకూడదని తన ఆఫీసులో పనిచేసే వారిని కూడగట్టుకుని ఆడవాళ్లని చూడకుండా ఆశా యూనియన్ నాయకులపై దాడికి తెగబడడాన్ని ఏఐటీయూసీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆశా వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు అనసూయ, జిల్లా కోశాధికారి అమ్ములు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వేణుగోపాల్

కలెక్టరేట్ ఎదుట ఆందోళన

కడప సెవెన్‌రోడ్స్ : ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని ప్రజల నుండి తీసుకొని అక్రమంగా తమిళనాడు, కర్ణాటక, కేరళ వంటి రాష్ట్రాలకు తరలిస్తున్న మైదుకూరుకు చెందిన రైస్ మిల్ యజమాని సూరిశెట్టి ప్రసాద్ పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు మాతయ్య మాదిగ, రాజా మాదిగ, విద్యార్థి సంఘ నాయకులు సుబ్బరాయుడు, శంకర్, జయవర్ధన్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కడప కలెక్టరేట్ ఎదురుగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ రేషన్ బియ్యంను ప్రజల నుండి తక్కువ ధరకు కొని ఆ బియ్యాన్ని పాలిష్ చేసి ఇతర రాష్ట్రాలకు అమ్ముతూ అక్రమాలకు పాల్పడుతున్నాడన్నారు. ఈ అంశంపై విచారణ చేపట్టి సూరిశెట్టి ప్రసాద్ పై కేసు నమోదు చేయాలన్నారు. అతడికి వత్తాసు పలుకుతూ తప్పుడు రిపోర్ట్ ఇస్తున్న ఖాజీపేట తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు పొన్నాల నరసింహులు, సుబ్బారావు పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్లను వెంటనే ప్రారంభించాలి

– కమలాపురం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి

కడప కార్పొరేషన్: కడప నగరంలో పూర్తయిన 4 అన్న క్యాంటీన్లను వెంటనే ప్రారంభించాలని కమలాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి కోరారు. గురువారం ఉదయం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం వద్దనున్న అన్న క్యాంటీన్‌ను ఆయన సందర్శించారు. అక్కడున్న రోజువారీ కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నరేన్ మాట్లాడుతూ రెండో దశలో సెప్టెంబర్ 5న అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తామని ప్రభుత్వం చెప్పింది, ఇంతవరకూ వాటిని ప్రారంభించలేదన్నారు. కమలాపురం, చెన్నూరులలో కూడా అన్నక్యాంటీన్లను ప్రారంభించాలని కోరారు. అలాగే గతంలో మొదట వచ్చిన 250 మందికే భోజనం అందించేవారని, ఇప్పుడు ఆ సంఖ్యను పెంచాల్సిన అవసరముందన్నారు. విజయవాడలో వరదలు వచ్చాయనే కారణం చూపి రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమం పట్ల నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. సూపర్ సిక్స్ హామీల సంగతే మరచిపోయారన్నారు. తల్లికి వందనం పథకాన్ని వచ్చే ఏడాదికి వాయిదా వేశారని, ఖరీఫ్ సీజన్ కూడా పూర్తి కావచ్చిందని, రైతులకు ఇవ్వాల్సిన పెట్టుబడి సాయం కూడా అందించలేదన్నారు. ఏమీ చేయకపోయినా మూడు నెలల్లోనే రూ.19వేలకోట్లు అప్పులు చేశారన్నారు. గత ప్రభుత్వం కరోనా కష్టకాలంలోనూ సంక్షేమ పథకాలను అందించిందని, ఈ ప్రభుత్వం ఏదో ఒక కారణం చూపి పథకాల అమలును వాయిదా వేయాలని చూస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా సంక్షేమ పథకాల అమలులో శ్రద్ధ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం. సుబ్బరాయుడు, నరసింహారెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమలాపురం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి

అకడమిక్ బ్యాంక్‌లో వివరాలు నమోదు చేయాలి

– వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి

వైవీయూ: డిగ్రీ చదివే విద్యార్థుల వివరాలు ఏబీసీ పోర్టల్లో నమోదు చేయాలని, ఆ దిశగా చర్యలను వేగవంతం చేయాలని వైవీయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. కృష్ణారెడ్డి అన్నారు. గురువారం వైవీయూ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్ లకు 'అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రియేట్ ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంటు రిజిస్ట్రీ (ఏపీఏఏఆర్)ఐడీ'ల సృష్టిపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం-2020 ప్రాముఖ్యతను అనుసరించి విద్యార్థులందరికీ ఏబీసీ ఏపీఏఏఆర్ ఐడీ నమోదును ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలన్నారు. విద్యార్థుల రిజిష్టర్డ్ ఐడీ భవిష్యత్తులో అత్యంత కీలకం కానుందన్నారు. దీర్ఘకాలిక ప్రయోజనాలను అందించే ఈ పోర్టల్ ఆవశ్యకతను గుర్తించాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథ రెడ్డి అన్నారు. ఐడీ ల సృష్టికి సంబంధించిన ఏవైనా సమస్యలు ఉంటే కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ సంపత్ కుమార్ ను సంప్రదించాలని సూచించారు. పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వర్ రెడ్డి , అసోసియేట్ ప్రొఫెసర్ డా. కె. శ్రీనివాసులు, నానోటెక్నాలజీ విభాగ సహ ఆచార్యులు డా.విజయ్ కుమార్, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ సంపత్ కుమార్, జిల్లాలోని అన్ని డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైవీయూ వీసీ ఆచార్య కృష్ణారెడ్డి

జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రం తనిఖీ

కడప అర్బన్: కడప నగర శివార్లలోని పోలీస్ శిక్షణా కేంద్రాన్ని గురువారం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శిక్షణా కేంద్రంలో పోలీస్ సిబ్బందికి ఎలాంటి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారో డీటీసీ ఇన్‌స్పెక్టర్ వినయ్‌కుమార్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. శిక్షణ సమయంలో పాటించాల్సిన అంశాల గురించి వివరించారు. కంప్యూటర్ ల్యాబ్, ప్రిన్సిపాల్ కార్యాలయం, పెరేడ్ గ్రౌండ్, జిమ్, తరగతి గదులను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని ఎస్పీ సూచించారు. భవిష్యత్తులో మరింత మెరుగైన విధంగా శిక్షణ కార్యక్రమాలు, భోజన, వసతి ఏర్పాట్లు వుండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మరియన్న, సిబ్బంది పాల్గొన్నారు.


కడప నగర శివార్లలోని జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

బకాయిలను చెల్లించాలి


మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాసుందర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రావాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ. శ్యాంసుందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కడపలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11వ పీఆర్సీ, కరువుభత్యం బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. సీపీఎస్ ఉద్యోగులకు, పెన్షనర్లకు కరువుబత్యం బకాయిలను నగదు రూపంలో చెల్లించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమంను కూడా సమాంతరంగా కొనసాగించాలన్నారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాష, శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శులు రాంభూపాల్ రెడ్డి, సుబ్బయ్య పాల్గొన్నారు.

రుణాలు మంజూరు చేయాలి


మాట్లాడుతున్న డీఎం ఓబులేసు యాదవ్

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలలో అర్హులైనవారందరికీ ప్రభుత్వం సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ గొర్రెల మేకల పెంపకదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు డీఎం ఓబులేసు యాదవ్ కోరారు. గురువారం కడపలోని ఏపీ గొర్రెల మేకల పెంపకదారుల సమాఖ్య కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ గొర్రెల, మేకల పెంపకదారుల సమాఖ్య రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం ఓబులేసు యాదవ్ మాట్లాడుతూ వర్షాల కారణంగా మేత దొరకక, జీవాలు అనేక రకాల జబ్బులతో మరణిస్తాయన్నారు. మరణించిన వాటికి ప్రభుత్వాలు నష్ట పరిహారం అందించడంలో విఫలం చెందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బుర్రి రెడ్డయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి తెల్లదార్ల విజయ్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

16న మిలాదున్నబీ ర్యాలీ

కడప కల్చరల్ : కడప నగరంలో ఈనెల 16వ తేదీన మిలాదున్నబీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ మర్కజ్ మిలాద్ జులూస్ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 9.30 గంటలకు అగాడిలోని ఇనాయత్‌ఖాన్ తాలిం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమై గుంతబజారులోగల అమీన్ షా ఫక్కీర్ సున్ని మసీదు వద్ద ముగుస్తుందన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేయనున్న వేదికపై నాతియా మెహఫిల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. మసీదు ప్రాంగణంలో రక్తదాన శిబిరాన్ని కూడా నిర్వహించనున్నారు.

వినాయక స్వామి లడ్డూ వేలం

కడప సెవెన్‌రోడ్స్ : వినాయక చవితి పండుగను పురస్కరించుకుని స్థానిక చంద్రపతాప్‌రెడ్డి కాలనీలో ఐదు రోజులుగా అత్యంత ఘనంగా వేడుకలు నిర్వహించారు. రామాలయ ప్రాంగణంలో ప్రతిష్టించిన వినాయక స్వామి లడ్డు వేలం పాటలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఆర్ కాలనీకి చెందిన వెంగమరాజు రూ. 35 వేలకు లడ్డూను దక్కించుకున్నారు.

వైవీయూ అధికారులపై చర్యలకు వినతి

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం వీసీ, రిజిస్ట్రార్‌లపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వి. గంగాసురేష్ కోరారు. గురువారం ఆయన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరభ్‌గౌర్‌లకు లేఖరాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం విశ్వవిద్యాలయంలో జరిగిన ఘటనకు అధికారుల నిర్లక్ష్యమే కారణమన్నారు. ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న అధికారి ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా, చీఫ్ వార్డెన్‌గా మూడు పదవులు నిర్వహిస్తున్నారన్నారు. దీంతో పర్యవేక్షణ లోపం కారణంగా తరచూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని లేఖలో పేర్కొనట్లు తెలిపారు.

రిమ్స్ మార్చురీలో మృతదేహం



కడప అర్బన్: కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)కు ఈనెల 3వ తేదీన అత్యవసర చికిత్స కోసం వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి (45) మరుసటి రోజున చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతని ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా వుంటే తగిన ఆధారాలతో తమను సంప్రదించాలని కడప రిమ్స్ వైద్యాధికారులు గురువారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.

వైవీయూలో పోలీసు అవుట్‌పోస్టు ప్రారంభించాలి

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో పోలీసు అవుట్ పోస్టు పునఃప్రారంభించాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి. తిరుమలేష్ కోరారు. గురువారం కడప నగరంలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ హర్షవర్ధన్‌రాజును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో విద్యార్థుల భద్రత దృష్ట్యా పోలీసు అవుట్ పోస్టు అవసరమని వివరించారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు భరత్‌సింహ, అమృత్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


విద్యార్థులకు ఆర్థిక సాయం చేస్తున్న వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు

కడప కార్పొరేషన్ / కడప కల్చరల్: కడప నగరంలోని యర్రముక్కపల్లె చౌడేశ్వరి వినాయక ఉత్సవ కమిటీ 17వ వార్షికోత్సవం సందర్భంగా ఫీజులు కట్టలేని ఇద్దరు విద్యార్థులకు ఆర్థిక సాయం చేశారు. గురువారం రూ. 10 వేల ఈ మొత్తాన్ని వారికి అందజేశారు. ఈ సందర్భంగా వినాయక ఉత్సవ కమిటీ కేంద్ర సభ్యులు లక్ష్మీనారాయణరెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, మారెమ్మ ఆలయ సంరక్షకులు భాస్కర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నూతన ఈడీకి సత్కారం


ఈడీ చెంగల్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు, ఉద్యోగులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన చెంగల్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో ఎన్ఎంయూఏ నాయకులు ఘనంగా సత్కరించారు. గురువారం యూనియన్ జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర, జోనల్ నాయకులు, ఎనిమిది రీజయన్ల అధ్యక్ష, కార్యదర్శులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పీవీ శివారెడ్డి, ఎన్వీ రమణ తదితరులు నూతన ఈడీకి పూల బొకే అందించి సత్కరించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

15న చదరంగం టోర్నమెంట్

కడప స్పోర్ట్స్: కడప నగరం అలంఖాన్‌పల్లెలోని విస్‌డమ్ హైస్కూల్‌లో ఈనెల 15వ తేదీన జిల్లాస్థాయి 21వ అష్రఫ్-ప్రసన్న మంత్లీ రోలింగ్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి బి. అనీస్‌దర్బారీ తెలిపారు. పూర్తి వివరాలకు 8341255151 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

డీఎంహెచ్‌ఓకు వైద్యుల వినతి


డీఎంహెచ్‌ఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న వైద్యులు

కడప రూరల్ : జీఓ నెంబరు 85కు వ్యతిరేకంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం ఆధ్వర్యంలో దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. అందులో భాగంగా గురువారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.నాగరాజుకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం సభ్యులు మాట్లాడుతూ ఈ జీఓ ద్వారా తమ మూడేళ్ల సర్వీసుకు అర్థం లేకుండా పోయిందన్నారు. దీంతో తమ వృత్తి ప్రగతికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ జీఓ వల్ల పీజీ అవకాశాలు తగ్గించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో వైద్యులు కె.రాఘవేంద్ర, వినయ్‌కుమార్, మహమ్మద్ హుసేన్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర పర్యటన

వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు క్షేత్రపర్యటనలో భాగంగా నగరంలోని అల్మాస్‌పేటలో ఉన్న ప్రధానమంత్రి కౌశల్ కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రంలో నిర్వహిస్తున్న నైపుణ్య శిక్షణ, ఉద్యోగ అవకాశాల కార్యక్రమం గురించి తెలుసుకున్నారు. కళాశాల అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జి. విజయలక్ష్మి, డా. ఎం. గురుమోహన్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, నాగవేణిల ఆధ్వర్యంలో విద్యార్థినుల బృందం పలు అంశాలను అధ్యయనం చేసింది. బుట్టల అల్లికలు, కుట్టుమిషన్, గార్లాండ్ మేకింగ్ తదితర అంశాలపై ఇస్తున్న శిక్షణను ప్రత్యక్షంగా పరిశీలించారు.

ఘన సన్మానం


ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న పాఠశాల ఉపాధ్యాయ బృందం

కడప ఎడ్యుకేషన్: సెప్టెంబర్ 5 గురుపూజోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన గురువులకు ఘన సన్మానం జరిగింది. సికెదిన్నె మండలం కొలుములపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు రమాదేవి, తెలుగు ఉపాధ్యాయులు సుబ్రమణ్యం, హిందీ ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మిలను ఆ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు, ఎస్టీయూ రాష్ట్ర నాయకులు కంభం బాలగంగిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం కొలుమలపల్లి జెడ్పీ హైస్కూల్లో సన్మానించారు. కొలుములపల్లి పాఠశాలకు మూడు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు రావడం చాలా సంతోషమని ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు.

ఘన నివాళి

కడప కల్చరల్ : మన జిల్లా నాటకానికి ఆయువుపట్టుగా నిలిచిన సంగీతజ్ఞుడు, దర్శకుడు బి.రామసుబ్బయ్య మరణంతో మంచి కళాకారుడిని కోల్పోయామని జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. గురువారం స్థానిక రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో జిల్లా రంగస్థల కళాకారులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నవోదయ సాంస్కృతిక కళా మండలి అధ్యక్షులు దాసరి సుధాకర్ మాట్లాడుతూ గత నెల 27న రామసుబ్బయ్య కడప నగరంలోని తన ఇంటిలో గుండెపోటుతో మరణించారన్నారు. దాసరి ప్రకాశ్ , దేవరశెట్టి గంగయ్య, కల్లూరి బాల యల్లారెడ్డి , విశ్రాంత తహసీల్దార్ వెంకటసుబ్బయ్య, రాజీవ్ కల్చరల్ క్లబ్ కార్యదర్శి బాల ఓబయ్య, కళాకారులు గంగయ్య, జేమ్స్, బాబు తదితరులు పాల్గొన్నారు.

స్పష్టమైన వైఖరితో కెరీర్‌కు బాటలు వేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న స్టెప్ సీఈఓ సాయిగ్రేస్

వైవీయూ: మనం ఎంపిక చేసుకున్న లక్ష్యాలపై స్పష్టమైన వైఖరితో కెరీర్‌కు బాటలు వేసుకోవాలని స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్ పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో స్టెప్ ఆధ్వర్యంలో «కెరీర్ కౌన్సిలింగ్»పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ కోర్సుల ఎంపిక ఇష్టం మేరకే చేసుకోవాలే తప్ప ఒత్తిడితోనో, ఎవరికో నమో చేసుకోకూడదన్నారు. న్యాయమూర్తి శంకర్ మాట్లాడుతూ కౌన్సిలింగ్ అనేది సరైన మార్గాన్ని కనుగొనడంలో సహాయపడుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి మాట్లాడుతూ కెరీర్ కౌన్సిలింగ్‌ను విద్యార్థినులు సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బారాయుడు, సూపర్‌వైజర్లు టి. నాగయ వి.వి. నారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.